నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

**భక్తుల** విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లాలో మంగళవారం వినాయక శోభాయాత్ర ఘనంగా జరిగింది. కామారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నిమజ్జన ప్రక్రియ వైభవంగా సాగింది. డీజేలు, బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా యువత నృత్యాలతో హోరెత్తించారు. శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

# వినాయక వీడ్కోలిక

## గంగమ్మ ఒడికి చేరిన గణపయ్య

**వినాయకులతో నిండిన వీధులు**

**ప్రశాంతంగా ముగిసిన శోభాయాత్ర**

**నృత్యాలతో హోరెత్తించిన యువత**



కామారెడ్డి చెరువులో భారీ వినాయకుడ్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

మద్నూర్‌లో..




కామారెడ్డిలో వినాయక విగ్రహాల వరుస...


బిచ్కుందలో వినాయక శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే


బిచ్కుందలో బాలుర ప్రదర్శనలు

# మువ్వన్నెల రెపరెపలు..

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం





కామారెడ్డి, సెప్టెంబర్ 17: జిల్లాలో ప్రజా పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణ పోరాట యోధులను స్మరించుకున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ అమరుల స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగా వెట్టి చాకిరి, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, మాతృభాషా అణిచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు తొలగిపోయాయన్నారు. 17 సెప్టెంబర్ 1948న హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూ శర్మ, డీఎఫ్‌వో నిఖిత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.


జెండావందనం చేస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ



కామారెడ్డిలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన


రామారెడ్డిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

# ‘కాంగ్రెస్‌ను తరిమికొట్టడం ఖాయం’

కామారెడ్డి,సెప్టెంబర్ 17: సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం కోసం నిర్దేశించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. కామారెడ్డి పట్టణ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిజాంసాగర్ చౌరస్తా వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు కేసీఆర్ గద్దె నిర్మిస్తే.. అక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి పతనం మొదలైందన్నారు. రేవంత్‌ను ప్రజలు తరిమి కొట్టే రోజులు ముందున్నాయని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నేతలు అనంతరాములు, పిప్పిరి ఆంజనేయులు, కుంబాల రవి యాదవ్, బల్వంత్‌రావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమాలపై జూపల్లి సీరియస్

## ఆబ్కారీలో అవినీతిపై ‘నమస్తే’ వరుస కథనాలు

## స్పందించిన మంత్రి కృష్ణారావు.. విచారణకు ఆదేశం







నిజామాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడే అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించే పరిస్థితి లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ఆబ్కారీ శాఖలో జరుగుతున్న అక్రమాలపై ‘నమస్తే తెలంగాణ’ సోమ, మంగళవారాల్లో ప్రచురించిన వరుస కథనాలపై ఆయన స్పందించారు. నిజామాబాద్ జిల్లాలో అక్రమాల పర్వంపై సమగ్ర విచారణ చేయాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను ఆదేశించారు. ఆబ్కారీ శాఖ బాధ్యతలు చూస్తున్న జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీగా ప్రాతినిధ్యం వహిస్తున్న చోటే అక్రమాలకు అడ్డుకట్ట లేకపోవడం అనేక విమర్శలకు తావిస్తున్నది. అధికారుల బరితెగింపుపై బహిరంగంగానే చర్చ జరుగుతున్నది. ఎక్సైజ్ శాఖలో అవినీతి, వసూళ్ల పర్వాన్ని కళ్లకు కట్టినట్లు ‘నమస్తే తెలంగాణ’ వరుస కథనాలను ప్రచురించిన సంగతి తెలిసిందే. మద్యం వ్యాపారులు, కల్లు డిపోలు తదితర ముఠాల నుంచి అక్రమంగా వసూళ్లకు తెగబడుతూ జేబులు నింపుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారుస్తున్న వైనాన్ని నమస్తే తెలంగాణ ఎత్తిచూపింది. ఈ నేపథ్యంలోనే సీరియస్‌గా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

### ఐఎంఎల్ డిపోలోనూ అదే వరుస..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని వైన్ షాపులకు మద్యాన్ని సరఫరా చేసే ఐఎంఎల్ డిపోలోనూ అవినీతి జరుగుతున్నదని బాధితులు చెబుతున్నారు. ఈ మేరకు నమస్తే తెలంగాణ ప్రతినిధికి ఫోన్లు చేసి గోడు వెల్లబోసుకున్నారు. ఆబ్కారీ అవినీతిపై వార్తలు ప్రచురించడంపై హర్షం వ్యక్తం చేసిన బాధితులు.. ఐఎంఎల్ డిపోలోనూ ఎక్సైజ్ అధికారులే బ్రోకర్లను పెట్టి నెలవారీగా మామూళ్లను వసూళ్లు చేస్తున్నారని వెల్లడించారు. డబ్బులు ఇవ్వకపోతే మద్యం సరఫరాలో ఇబ్బందులు పెడుతున్నారని, చలాన్లు ముందే తీసుకున్నప్పటికీ చేయి తడపకపోతే లోడింగ్ విషయంలో జాప్యం చేస్తున్నారని వాపోయారు. వారి వేధింపులు భరించలేక రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఇస్తున్నట్లు చెప్పారు. ఇలా వసూలయ్యే మొత్తాన్ని కీలక అధికారులతో పాటు ఐఎంఎల్ డిపో నిర్వహణలో సంబంధం ఉన్న పాత్రధారులంతా పంచుకుంటున్నట్లు తెలిసింది. మాక్లూర్ మండలం మాదాపూర్‌లో ఉన్న ఐఎంఎల్ డిపోపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం వెనుక అవినీతికి మద్దతుగా నిలుస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవంలో జిల్లా నేతలు ముజీబుద్దీన్, దఫేదార్ రాజు, విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

